ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ : 05.12.2025 సమయం : 1810 గంటలు

ముఖ్యాంశాలు

1. వరంగల్ విమానాశ్రయ పనులను వచ్చే మార్చి లోగా ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు.

2. విదేశీ విశ్వవిద్యాలయాలను రాష్ట్రానికి తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు.

3. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భరోసా ఇచ్చారు.

4. రాష్ట్ర ఆర్థిక లక్ష్య సాధనలో వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.

--------------------------

**ముఖ్యమంత్రి**

హైదరాబాద్ తర్వాత వరంగల్ కు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, వరంగల్ విమానాశ్రయానికి డిసెంబర్ నెలాఖరులోగా భూసేకరణ పనులు పూర్తిచేసి వచ్చే మార్చి లోగా నిర్మాణ పనులను, వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను, ఔటర్ రింగ్ రోడ్డు పనులను ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈరోజు నర్సంపేటలో 58 కోట్ల 84 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి

శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ... దేశంలోనే వరి ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని అన్నారు. రైతు సంక్షేమం కోసం రైతు భరోసా , రైతు బీమా అందించి, సన్న వడ్లకు బోనస్ ఇస్తున్నామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో నర్సంపేట నియోజకవర్గానికి 3వేల 500 ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

**బైట్ సీఎం రేవంత్ రెడ్డి**

200 కోట్ల రూపాయల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణ పనులకు, 130 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ప్రభుత్వ వైద్య కళాశాల సహా పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

**పీటీసీ - వరంగల్**

----------------------------

**ఏఐ ఎక్స్ లెన్స్ సెంటర్**

విదేశీ విశ్వవిద్యాలయాలను రాష్ట్రానికి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. ఆస్ట్రేలియాకు చెందిన డీకిన్ యూనివర్సిటీ భాగస్వామ్యంతో రాష్ట్రంలో కృత్రిమ మేథకు సంబంధించిన సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ను ఏర్పాటు చేయడానికి ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్యా మంత్రి జూలియన్ హిల్ తో కలిసి సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు ఎంఒయు వివరాలను వెల్లడించారు. ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేయనున్న ఏఐ యూనివర్సిటీలో ఈ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ను నెలకొల్పనున్నట్టు మంత్రి తెలిపారు. ఇప్పటికే ఉద్యోగాల్లో ఉన్న వృత్తి నిపుణులకు తమ దేశంలో ఉన్నత స్థాయి నైపుణ్యాల్లో శిక్షణ అందించడానికి కూడా ఆస్ట్రేలియా అంగీకరించిందని ఆయన వెల్లడించారు.

**జీఎస్**

-------------------------

**పొంగులేటి**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ ర జు సచివాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ... అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు కేటాయించే బాధ్యత ప్రభుత్వానిదన్నారు. మూడేళ్లలో పట్టణ ప్రాంతాల్లో కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, జీ ప్లస్ త్రీ, జీ ప్లస్ ఫోర్ విధానంలో ఇళ్లు నిర్మిస్తామని వివరించారు. ప్రస్తుతం 3 లక్షల 82 వేల ఇళ్ల నిర్మాణం జరుగుతోందని మంత్రి తెలిపారు. హిల్ట్ పాలసీపై బీఆర్ఎస్ పార్టీ నేతలు చేస్తున్న విమర్శలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తిప్పికొట్టారు.

**జీఎస్**

------------------------

**మంత్రి తుమ్మల**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "Telangana Rising Global Summit – 2025" ప్రధాన లక్ష్యం రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సుమారు 200 బిలియన్ డాలర్ల వద్ద ఉందని, వచ్చే రెండు దశాబ్దాల్లో తెలంగాణను 15 రెట్ల పెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చే మహాదృక్పథానికి ఈ గ్లోబల్ సమిట్ ప్రధాన వేదికగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈరోజు సచివాలయంలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి తుమ్మల సమ్మిట్ లో ప్రదర్శించాల్సిన AVల కంటెంట్ పై అధికారులకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణ వ్యవసాయరంగం అభివృద్ధి సామార్థ్యాలు, విదేశీ పెట్టుబడి అవకాశాలు, భవిష్యత్ విజన్ స్పష్టంగా ప్రతిబింబించేలా AV లను రూపొందించాలని అన్నారు. వ్యవసాయ రంగమే రాష్ట్ర ఆర్థిక లక్ష్య సాధనలో అత్యంత కీలక పాత్ర పోషించబోతోందని మంత్రి స్పష్టం చేశారు.

**జీఎస్**

------------------------------

**మంత్రి సీతక్క**

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అభివృద్ధి చేసే మంచి వాళ్లనే ఎన్నుకోవాలని మంత్రి సీతక్క కోరారు. ములుగు జిల్లా ఏటూరునాగారంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి చేస్తోందని అన్నారు.

**బైట్ మంత్రి సీతక్క**

**పీటీసీ - ములుగు**

------------------------

**ఫ్లాగ్ డే**

సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఈ రోజు సాయుధ దళాల పతాక నిధికి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా సైనిక్ వెల్ఫేర్ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఈ రోజు సమావేశమయ్యారు. సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి ముఖ్యమంత్రి లక్ష రూపాయల విరాళం అందించారు. అనంతరం బోల్డ్ అండ్ బ్రేవ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

**పీఎస్**

------------------------

**ఉస్మానియా యూనివర్సిటీ**

ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఖర్చు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అభివృద్ధి పనుల్లో విద్యార్థులు, బోధన సిబ్బంది అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ రోజు తన నివాసంలో నిర్వహించిన సమీక్ష సందర్భంగా అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అయితే నిర్మాణాలకు సంబంధించి ముఖ్యమంత్రి పలు మార్పులు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇప్పటికే ఉన్న జల వనరులను సంరక్షిస్తూనే నూతన జల వనరుల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. విద్యార్థులు, సిబ్బంది భవిష్యత్తులోనూ ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా నిర్మాణాలు ఉండాలని అన్నారు.

**జీఎస్**

-----------------------

**పొన్నం ప్రభాకర్**

రాష్ట్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి, గ్రామాల్లో కూడా విస్తరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దత్తాత్రేయ జయంతి ఉత్సవాల్లో భాగంగా, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వరదవెల్లి దత్తాత్రేయ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ....

**బైట్ మంత్రి పొన్నం**

**పి టి సి రాజన్న సిరిసిల్ల**

---------------------

**కలెక్టర్ గరిమ అగర్వాల్**

విద్యార్థులు చదువుతోపాటు ఆటలోనూ రాణించాలని, రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగర్వాల్ అన్నారు. తంగళ్లపల్లిలోని కేంద్రీయ విద్యాలయం వార్షిక ఆటల పోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి ప్రణాళిక ప్రకారం చదివి లక్ష్యం చేరుకోవాలని పిలుపు ఇచ్చారు. క్రీడలు, యోగా సాధనతో శారీరక, మానసిక సమతుల్యత, అభివృద్ధి సాధ్యమన్నారు. తరగతి గది పుస్తకాలతోపాటు లైబ్రరీ లోని ఇష్టమైన పుస్తకాలు, దిన పత్రికలు చదవాలని పేర్కొన్నారు.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

------------------------

**ఏసీబీ వారోత్సవాలు**

లంచం అడగడం, తీసుకోవడం నేరమని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఏసీబీ వారోత్సవాలలో భాగంగా జరిగిన కార్యక్రమంలో గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎవరైనా ప్రభుత్వ అధికారి, ఉద్యోగి లంచం అడిగితే వెంటనే 1064 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని అన్నారు.

**పీటీసీ నల్లగొండ**

-------------------------------

**ప్రపంచ నేల దినోత్సవం**

రైతులు భూమికి జరిగే నష్టాన్ని తగ్గించుకొని సారవంతమైన నేలను కాపాడుకోవలసిన అవసరం ఉందని రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండల వ్యవసాయ అధికారిణి వినీత సూచించారు. ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా రైతులకు అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ...

**బైట్ వ్యవసాయ అధికారిణి వినీత**

**పిటిసి - రాజన్న సిరిసిల్ల**

-----------------------

**సదరం శిబిరాలు**

ఆసిఫాబాద్ జిల్లాలో ఈ నెల 10 నుండి నిర్వహించే సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి దత్తరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంటి చూపు, మానసిక వైకల్యం, రక్తహీనత, సికిల్ సెల్, మూగ, చెవిటి, ఎముకలకు సంబంధించిన శిభిరాలు 20 రోజుల పాటు నిర్వహిస్తామని వివరించారు.

**ఆసిఫాబాద్ - పిటిసి**

-----------------------

**వాతావరణం**

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతున్నాయి. ఉధయం రాత్రి వేళల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. రాబోయే రెండు, మూడు రోజుల పాటు ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది.

**పీఎస్**

----------------------------